క్లుప్తంగా

కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న సీఐటీయూ నాయకులు

బేస్తవారిపేట: భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్ అన్వర్ బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ జితేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కంభంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని, జీఓ నంబర్ 1241 రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అమృతరాజు, గన్నపుడి అబ్రహం, డి.తిరుపతయ్య, రమణయ్య, దేవదానం పాల్గొన్నారు.

రంగాపురం మాజీ సర్పంచ్ మృతి

అర్ధవీడు(బేస్తవారిపేట): మండలంలోని రంగాపురం మాజీ సర్పంచ్ కాండ్లవత్ పెద్ద కాశినాయక్ గురువారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కాశినాయక్ మృతిపై వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని సచివాలయ ఉద్యోగులకు కమిషనర్ డి.వెంకటదాసు సూచించారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో వార్డు సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. సకాలంలో విధులకు హాజరవడంతోపాటు విధి నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పనిచేయాలని స్పష్టం చేశారు.

నర్సరీల్లో నిబంధనలు పాటించాలి


నర్సరీని పరిశీలిస్తున్న విష్ణుప్రియ

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం నర్సరీలు నిర్వహించాలని ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ పేర్కొన్నారు. మండలంలోని ముండ్లపాడు గ్రామంలో నర్సరీలను ఆమె గురువారం తనిఖీ చేశారు. నర్సరీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రైతులకు నాణ్యమైన మొక్కలు విక్రయించాలని సూచించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఉద్యానశాఖ సిబ్బంది ఉన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు కూలి


కూలీలతో మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ

బేస్తవారిపేట: ఉపాధి హామీ పథకంలో ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే గిట్టుబాటు కూలి దక్కుతుందని డ్వామా ఏపీడీ భాస్కరరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని నేకునాంబాద్‌లో ఉపాధి హామీ పనులను ఆయన తనిఖీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయాన్నే పనికి రావాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ గురువరకుమార్, టీఏ అంబటి రమేష్ ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్


బాధ్యతలు చేపడుతున్న కమిషనర్ నారాయణరావు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కమిషనర్‌గా డీవీఎస్ నారాయణరావు బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై మార్కాపురం కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కిరణ్ మాతృ సంస్థ అయిన ఆడిట్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కాపురం పట్టణంలో పారిశుధ్యం, నీటి సరఫరా, లైటింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. పట్టణంలో సంచరిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ఆవులు, కుక్కలు, కోతులు, పందుల సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు


కంభం : పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలో స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా సాగుతున్నాయి. బేస్తవారిపేటలోని జెడ్పీ బాలుర హైస్కూల్లో క్రీడా పోటీలను ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి గురువారం ప్రారంభించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలు అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటారు. ఎంఈఓ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములను విద్యార్థులు సమానంగా తీసుకోవాలని సూచించారు.

గిద్దలూరు రూరల్: క్రీడల్లో గెలుపోటములను విద్యార్థులు సమానంగా స్వీకరించాలని ఎంపీపీ కడప లక్ష్మి సూచించారు. గురువారం పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ప్రాంగణంలో స్కూల్ గేమ్స్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మధు, ఎంఈఓలు కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి, పీఈటీ శోభన్‌బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు గురువారంతో ముగిశాయి. ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్(గర్ల్స్)లో పెద్దనల్లకాల్వ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, యోగాలో కంభం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందినట్లు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు ఈనెల 21 నుంచి గిద్దలూరులో నియోజకవర్గ స్థాయి పోటీ ల్లో పాల్గొంటారని తెలిపారు.

బేస్తవారిపేట: అర్ధవీడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో మండల స్థాయి క్రీడాపోటీలను ఎంఈఓలు అబ్దుల్ సత్తార్, నాయక్ గురువారం ప్రారంభించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి, పీడీలు, పీఈటీలు పర్యవేక్షించారు.

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను హెచ్ఎం దొడ్డా రామాంజనేయరెడ్డి ప్రారంభించారు. 15 ఉన్నత పాఠశాలల నుంచి 300 మందికి పైగా బాలబాలికలు అథ్లెటిక్స్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను పరిశపోగు బాబూరావు, ఎస్ఎంసీ చైర్మన్ కోటేశ్వరరావు, చిలకల అశోక్‌రెడ్డి, రామారావు, మండల క్రీడా సమన్వయకర్త ఎ.వెంకటస్వామి, స్కౌట్ మాస్టర్ కొండయ్య పర్యవేక్షించారు.


గిద్దలూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మి


గజ్జలకొండలో పోటీలను ప్రారంభిస్తున్న హెచ్ఎం రామాంజనేయరెడ్డి

‘ఉపాధి’పై వెల్లువెత్తిన ఆరోపణలు

- కొనకనమిట్లలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక


ప్రజా వేదికలో మాట్లాడుతున్న పీడీ

కొనకనమిట్ల: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఏడాదికిగాను చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. గురువారం కొనకనమిట్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ అర్జున్‌రావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులపై డీఆర్పీల పర్యవేక్షణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలో 611 పనులకుగాను రూ.14.45 కోట్ల వరకు నిధులు ఖర్చు చేశారు. చెక్ డ్యాంలు, చెరువు, కుంటల్లో పూడికతీత పనులకు సంబంధించి కొలతల్లో తేడాలు ఉన్నాయని, జాబ్ కార్డులు సక్రమంగా పంపిణీ చేయలేదని ఫిర్యాదులు అందాయి. కాగా, డీఆర్పీల నివేదికకు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు చెప్పేవాటికి పొంతన లేదంటూ పీడీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పీడీ మాట్లాడుతూ.. ప్రజా వేదికలో వెల్లడించిన అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, క్లస్టర్ ఏపీడీ నిర్మలాదేవి, వెంకటస్వామి, ఎస్ఆర్‌పీ మూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, ఏపీఓలు బుల్లెన్నరావు, ఈసీ శ్రీనివాసరెడ్డి, వీఎస్ఏలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తర్లుపాడు ఎస్సై


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై బ్రహ్మనాయుడు


బాధ్యతలు చేపడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లునాయక్

తర్లుపాడు: తర్లుపాడు ఎస్సైగా బ్రహ్మనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాల గురించి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై రాజ్‌కుమార్ కొనకనమిట్లకు బదిలీ అయ్యారు.

బాధ్యతలు స్వీకరించిన కొమరోలు ఎస్సై

కొమరోలు: కొమరోలు నూతన ఎస్సైగా వెంకటేశ్వర్లు నాయక్ గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఆయనను కొమరోలు ఎస్సైగా నియమిస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎస్సైగా పనిచేసిన మధుసూదన్‌రావును వెలిగండ్ల పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు.

మద్యం తాగొద్దన్నందుకు దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న పెద్దసుబ్బయ్య

మార్కాపురం రూరల్: నిర్మాణంలో ఉన్న సచివాలయం వద్ద మద్యం తాగవద్దని చెప్పినందుకు ఇద్దరు వ్యక్తులపై మందుబాబులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం మార్కాపురం మండలం కందివారిపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గోగులదిన్నె గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్న వై.వెంకటరత్నం, సాయి.. నూతన సచివాలయం వద్ద మద్యం తాగుతున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన మురికిపూడి పెద్దసుబ్బయ్య, బేతం అశ్విని అటుగా వస్తూ.. ఇక్కడ మద్యం తాగవద్దు, ఇంకెక్కడికైనా వెళ్లాలని సూచించారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. వెంకటరత్నం, సాయి కర్రలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన పెద్దసుబ్బయ్య, అశ్వినిని స్థానికులు 108లో తొలుత మార్కాపురం జీజీహెచ్‌కు, మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. ఈ ఘటనపై మార్కాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

కొమరోలు: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు 20వ తేదిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.కాశయ్య తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అండర్–14, అండర్–17 బాలబాలికలకు 7 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.విజయ్‌కుమార్‌కు పేర్లు అందజేయాలని సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు


గాయపడిన దుర్గారావు

మార్కాపురం టౌన్: విద్యుదాఘాతానికి గురై వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి పట్టణంలోని కరెంటు ఆఫీసు వెనుక ప్రాంతంలో చోటుచేసుకుంది. పూలసుబ్బయ్య కాలనీలో నివాసముండే తాళ్ల దుర్గారావు బేల్దారి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం రాత్రి కరెంటు ఆఫీసు వెనుక ప్రాంతలో ఇంటి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మార్కాపురం జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు.

అడవిపంది దాడిలో మహిళలకు గాయాలు


గాయపడిన చెన్నమ్మ

బేస్తవారిపేట: ఉపాధి హామీ పనులు చేస్తుండగా అడవి పంది దాడి చేయడంతో మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన బేస్తవారిపేట మండలంలోని జెన్నివారిపల్లెలో గురువారం చోటుచేసుకుంది. పాలకూరి చెన్నమ్మ గ్రామస్తులతో కలిసి చెరువు సమీపంలో ఉపాధి హామీ పనులు చేస్తోంది. పక్కనే ఉన్న ముళ్లపొదల్లో నుంచి అడవి పంది ఒక్కసారిగా దాడిచేయడంతో చెన్నమ్మ ముఖంపై తీవ్ర గాయమైంది. క్షతగాత్రురాలిని తోటి కూలీలు మోటార్‌సైకిల్‌పై గలిజేరుగుళ్ల పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురానికి తీసుకెళ్లారు.

స.హ చట్టంపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ

గిద్దలూరు రూరల్: సమాచారం హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఓ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై గురువారం రైతులు, మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఓ మాట్లాడుతూ.. అధికార యంత్రాంగంలో పారదర్శకత తీసుకురావడం, అవినీతిని అరికట్టడం, ప్రజలకు జవాబుదారీగా ఉండటం స.హ చట్టం ముఖ్య ఉద్దేశమని వివరించారు. సమాచారం పొందడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ, పట్టుపరిశ్రమ శాఖ అధికారి రంగస్వామిరెడ్డి, ఎంపీఈఓ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుపై శ్రద్ధతో బంగారు భవిత


విద్యార్థినులతో మాట్లాడుతున్న తులసి స్వప్న

మార్కాపురం టౌన్: ప్రస్తుత సమాజంలో మహిళలు, విద్యార్థినులు, బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండి, అప్రమత్తంగా ఉండాలని వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ మార్కాపురం బ్రాంచ్ మోటివేషనల్ ట్రైనర్ ఎస్.తులసీ స్వప్న సూచించారు. గురువారం రెడ్డి మహిళా కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుపై శ్రద్ధ పెట్టాలని, ప్రేమ, ఆకర్షణకు దూరంగా ఉండాలని హితబోధ చేశారు. ప్రస్తుతం మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ చాలా అవసరమన్నారు. మానసిక ధైర్యాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్మర్ శ్రీనివాస్‌కు సత్కారం


శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న రమణారెడ్డి

పొదిలి: నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన స్విమ్మర్ గోపనబోయిన శ్రీనివాస్‌ను స్థానిక వివేకానంద విద్యా సంస్థల చైర్మన్ కేవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయనకు రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్, కళాశాల డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎంవీ కుమార్, ఏఓ అశోక్ బండి, ఎద్దు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం


బేస్తవారిపేట : రక్తపరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

బేస్తవారిపేట: శరీరానికి తగిన పోషకాలు అందే విధంగా సమతుల ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలోఫర్‌బేగం సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కేజీబీవీలో విద్యార్థులకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. బాలికలకు హెచ్‌బీ శాతాన్ని తెలియజేసి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ఓ హబీబ్‌ఖాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెకుముకి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

మార్కాపురం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్‌ను గురువారం జేవీవీ నాయకుడు ఏనుగుల రవికుమార్ ఆవిష్కరించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు సైన్స్ సంబరాలకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు చక్కిళం శ్రీధర్, జి.ముక్తేశ్వరరావు, ఒ.రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, బాలయోగి, దుర్గా భవాని, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలి


ఎస్సైని సన్మానిస్తున్న మహిళా పోలీసులు


కొనకనమిట్ల: గ్రామ సచివాలయ మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్సై టి.రాజ్‌కుమార్ సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైని గురువారం మహిళా పోలీసులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగితే సమాచారం ఇవ్వాలని సూచించారు. స్టేషన్ రైటర్ మురళి, సిబ్బంది ఉన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి


మల్లవరంలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని 32 రెవెన్యూ గ్రామాల రైతులు ఈ నెల 23వ తేదీ నాటికి పంట నమోదు, ఈకెవైసీ చేయించుకోవాలని ఏఓ ఎస్‌కే జైనులాబ్దిన్ సూచించారు. గురువారం మల్లవరం పంచాయతీలో పంటలను పరిశీలించడంతో పాటు, పంట నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మండలంలో కంది, సజ్జ పంటలకు చీడ పీడలు ఆశించలేదని చెప్పారు.

బలిజ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కంభం: కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవాసంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పగిడి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా ఉదయగిరి మల్లికార్జున, కోశాధికారిగా జలపాటి లోకేష్, ఉపాధ్యక్షుడడిగా తిప్పిశెట్టి రజినికాంత్, జాయింట్ సెక్రటరీగా పోలు అనంతరావు, కర్ణ వెంకటశివ, గౌరవ సలహాదారులుగా ఆకుల మురళి, కాలువ బాలరంగయ్య, సోమిశెట్టి నారాయణ, లంకా నరసింహులు, కాసుల రంగస్వామి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. బలిజ సామాజికవర్గ సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని అధ్యక్ష, ప్రధాన కారదర్శులు తెలిపారు. సభ్యత్వ రుసుం చెల్లించి మరింత మంది సభ్యులుగా చేరాలని వారు కోరారు.

వ్యవసాయ కార్యాలయంలో పాము కలకలం


బంధించిన పాముతో స్నేక్ క్యాచర్

మార్కాపురం: మార్కాపురం వ్యవసాయశాఖ కార్యాలయంలో పాము కలకలం రేపింది. సిబ్బంది విధి నిర్వహణలో ఉండగా సుమారు 5 అడుగుల పొడవు ఉన్న సెట్రికా పాము పాకుతూ వెళ్తుండటాన్ని గుర్తించి స్నేక్ క్యాచర్ నిరంజన్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే వచ్చి పాము బంధించి అటవీ ప్రాంతంలో వదిలారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

గిద్దలూరు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అన్నా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల తక్కువ ధరకు ఆహారం అందించేందుకు క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డి.వెంకటదాసు, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జెడ్పీటీసీ సభ్యుడు బుడతా మధు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొదిలిలో కోతుల బెడద


వీధిలో గుంపుగా సంచరిస్తున్న కోతులు

పొదిలి: పొదిలి నగర పంచాయతీ పరిధిలోని ఓబులశెట్టి వారివీధిలో కోతుల బెడద అధికం కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లలోకి చొరబడి దొరికిన వస్తువులను ఎత్తుకెళ్తుండటం, పాదచారులు, వాహనదారులకు భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో రోడ్డెక్కేందుకు జనం భయపడుతున్నారు. చేతుల్లో ఉన్న సంచులను లాక్కుని పలాయనం చిత్తగిస్తున్న కోతులను ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోవాల్సి వస్తోందని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.